# హత్య

"ఎవరు కావాలి?"
"ఎస్.ఐ. గారు."
"లేరు. ఏమిటి పని?"
"హత్య చేశాను"



ఆదిరాజు వేణుగోపాల్

బిత్తరపోయాడు కానిస్టేబుల్. కరెంటు లేదు. స్టేషన్ లోపల కొవ్వొత్తి గుడ్డిగా వెలుగుతున్నది.

"జోకు లేస్తున్నావా?"

"లేదు. నిజమే చెబుతున్నాను."

"ఎందుకు చంపావ్?"

"నన్ను మోసం చేసింది."

"మోసం చేసినంత మాత్రాన చంపెయ్యటమేనా?"

"నాది అనుకున్న స్త్రీ, వేరొకరికి కూడా ఆ అనుభవాన్ని పంచి పెట్టడం భరించ లేకపోయాను.

"నీ భార్య రంభా?"

"నా దృష్టిలో రంభే."

"నీ దృష్టిలో కాదయ్యా. పది మందికీ ఎలా ఉంటుంది?"

"పది మందికీ రంభ లాగానే ఉంటుంది."

"అదీ సంగతి! ఎవడో ముగ్గులోకి లాగుంటాడు."

"తనే ఇష్టపడింది..."

"ఎన్ని రోజుల నుంచి జరుగుతున్నది?"

"తెలియదు. నాకు తెలిసింది ఈ మధ్యనే."

కానిస్టేబుల్ కొద్దిసేపు మౌనం వహించాడు.

"ఆమెను చంపి నీ జీవితాన్ని పాడు చేసుకున్నావ్"

"నాకు జీవించాలన్న ఆశ లేదు."

మళ్లీ కొద్దిసేపు మౌనం వహించాడు కానిస్టేబుల్. ఆ తర్వాత నెమ్మదిగా అన్నాడు.

"ఆమె జీవితం ఆమె ఇష్టం. ఆమెను శాసించే అధికారం నీకెక్కడిది? నీ కిష్టం లేకపోతే నీ ఇంట్లోంచి, నీ జీవితంలోనుంచి, వెళ్లిపొమ్మన వచ్చు. అంతేగాని చంపే అధికారం నీకు లేదు."

"ఉంది. ఎందుకంటే నేను ఆమెను ప్రేమించాను. పైగా ఆవిడ నా భార్య."

"ఆవిడ ప్రేమించలేదని తెలుస్తున్నది కదయ్యా!"

"మేమిద్దరం ప్రేమించుకొని, పెళ్లి చేసుకొన్నాము."

"బహుశా నీ మీద ఆమెకి ప్రేమ తగ్గి పోయి ఉండవచ్చు. మార్పుని కోరుకొని ఉండవచ్చు."

అతను మాట్లాడలేదు.

"నీ మీద ప్రేమ తగ్గిపోయినంత మాత్రాన నీవు ఆమెను చంపటం నాకు నచ్చలేదు. ఆమె జీవితాన్ని ఆమెను అనుభవించనీయకుండా చేశావ్!"

"నా భార్య మీద నాకు అధికారం ఉంది."

"భార్య అంటే ఎవరు? ఒక స్త్రీ. నీతో సహ జీవనం చేయటానికి వచ్చిన సాటి మనిషి. సాటి మనిషి మీద అధికారం ఎందుకు చెలాయించాలి. ఇష్టం లేకపోతే విడాకులు ఇచ్చెయ్యి. ఆపై నీ జీవితం నీ ఇష్టమని చెప్పు."

"మాటలు వేరు జీవితం వేరు."

"నిజం!" గొణిగినట్లుగా అన్నాడు కానిస్టేబుల్. "సంఘానికి భయపడ్డావా?"

"అవును. ఆ సంగతి తెలిసిన రోజున నాకు పిచ్చెక్కినట్లయింది. ప్రతివాడూ నా వెనుక నవ్వుకున్నట్లుగా అన్పించింది. చివరికి నా భార్య కూడా నా అమాయకత్వానికి ముసిముసిగా నవ్వుకుంటున్నట్లు అన్పించింది. నన్ను వెధవను చేసిన ఆమెను చంపెయ్యాలనుకున్నాను."

"తోటి మనిషిని చంపే అధికారం నీకు లేదయ్యా."

"లేదు కాబట్టే అలా చంపితే శిక్ష వేసేందుకు న్యాయస్థానాలు ఉన్నాయి. ఆ శిక్ష అనుభవించటానికే కదా లొంగిపోతున్నాను."

"ఎంతమంది పిల్లలు?"

"ఇద్దరు."

"నీ పిల్లలేనా అన్న అనుమానం నిన్ను పీడించిందా?"

"అవును" నిట్టూరుస్తూ అన్నాడతను. "ఆ ఊహే నాకు భరింపరానిదిగా ఉంది. ఆ అనుమానాన్ని మనసులో నుంచి నెట్టి వేద్దామని ఎంతగా ప్రయత్నిస్తున్నానో, అంతకన్నా రెట్టింపు వేగంతో అది నన్ను దగ్గరికి లాక్కొని ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. ఒక్కోసారి వాళ్లు నా పిల్లలే అన్న గట్టి నమ్మకం కలుగుతుంది. అపుడు మనసుకు హాయి అన్పిస్తుంది."

"ఇప్పుడు నీ పిల్లలు ఏమై పోతారో ఆలోచించావా?"

"లేదు. అలా ఆలోచిస్తే నా ఆవేశం చల్లారి పోతుంది. ఆవేశం చల్లారిపోతే నేను ఆమెను చంపలేను. కసి తీరేదాకా ఆమెను బెడ్‌రూంలో పొడిచి పొడిచి చంపేశాను."

"పోనీ అతడిని పిలిచి హెచ్చరించ వచ్చు కదా?"

"నాకిష్టం లేదు. ఇదేమి రేప్ కాదు కదా! నా భార్యకి ఇష్టమై అతనితో సంబంధం పెట్టుకుంది. అతను కాకపోతే రేపు మరొకడు అవుతాడు. అతన్ని నేనెందుకు మందలించాలి?"

"బాగానే ఉంది ఆలోచన" నవ్వాడు కానిస్టేబుల్.

ఇద్దరి మధ్య కొద్దిసేపు నిశ్శబ్దం అలుముకుంది. ఆఖరికి నిట్టూరుస్తూ అన్నాడు కానిస్టేబుల్.

'భార్యాభర్తల మధ్య ఉండాల్సింది ప్రేమ. లేనినాడు ఇక కలసి జీవించటం అనవసరం. కారణాలు ఏమయినప్పటికీ ఆమె ఇంకొక వ్యక్తితో సంబంధం పెట్టుకోవడానికి ఇష్టపడింది. ఆ వాస్తవాన్ని నీ వంగీకరించాలి. నీ మీద అసంతృప్తితో ఆవిడ, ఆవిడ మీద అసంతృప్తితో నీవుండి కలసి జీవించటం అనవసరం. మనం సంఘానికి భయపడతాము. సంఘం మనల్ని వెధవలుగా చూడవచ్చు. కాని సాటి మనిషిని చంపే హక్కు మనకు లేదు. నీ భార్య అయినంత మాత్రాన ఆమె ఎల్లప్పుడూ నీ ఇష్టప్రకారం నడవలేదు కదా! ఆమె ఇష్టా ఇష్టాలు ఆమెకి ఉంటాయి. నీ పట్ల ఆమెకు మనసు లేనపుడు ఆమెను కట్టి పడెయ్యటం ఎందుకు? నేనయితే ఆమెను వెళ్లి పొమ్మంటాను.'

కానిస్టేబుల్ చెప్పటం ఆపాడు. అదే క్షణంలో కరెంటు వచ్చింది. కానిస్టేబుల్ మనసు తేలిక పడింది. ఓ నిర్ణయానికి వచ్చాడు.

◆ ◆ ◆

ఇంటికి వచ్చిన తర్వాత భార్యను దగ్గరికి పిల్చి అన్నాడు.

"చూడు! గత మూడు రోజులుగా నిన్ను చంపేద్దామనుకుంటున్నాను. నేనెందుకు నిన్ను చంపాలి అన్న ప్రశ్న నన్ను ఆలోచింప జేసింది. అనేకమైన ఆలోచనలతో ఈ మూడు రోజులు నలిగిపోయాను. నీకు నాకూ మధ్య ఉండే సున్నితమైన బంధం తెగి పోయింది. నన్ను అడ్డం పెట్టుకొని నీవు నాటకాలు ఆడవద్దు. నీకు విడాకులు ఇస్తాను. దయచేసి వెళ్లిపో. నీ జీవితం నీ ఇష్టం ఆపైన."

"నేనివ్వను" మొండిగా అంది.

"అయితే నిన్ను చంపేస్తాను. ఈ రోజే ఒకతను ఆ పని చేశాడు."

ఆమె కళ్లలో భయం కదలాడింది. కానిస్టేబుల్ చిరునవ్వు నవ్వాడు.

●

